క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని కరెమ్మ గుడి, గాజుల బావి వీధి, కమాటం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రోజ్ మేరీ, రాధాలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతాం

గుత్తి: గుత్తిలో ట్రాఫిక్ సమస్య జటిలమైందని త్వరలోనే ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. గుత్తిలోని రాయల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీ సర్కిల్, మెయిన్ బజారు తదితర చోట్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమైందన్నారు. పోలీసులు భాగస్వామ్యంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సీఐ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా రోజుకు ఒకసారి మున్సిపాలిటీ పరిధిలో ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడదామన్నారు. అందుకు సీఐ సానుకూలంగా స్పందించారని కమిషనర్ చెప్పారు. త్వరలోనే కార్యాచరణ మొదలవుతుందన్నారు.

187 మందికి ఉద్యోగావకాశాలు


ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 187 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ, మెడ్‌ప్లస్, టాటా ఎలక్ట్రాన్, కెఎల్.గ్రూప్, హావెల్స్, బిగ్ బాస్కెట్, డైకిన్ ఏసీ, ఐఐఎఫ్ఎల్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్, జాయ్‌కార్ట్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్ కేర్, యాక్సిస్‌బ్యాంక్, యంగ్ ఇండియా కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరైన 240 మంది నిరుద్యోగ యువతీ, యువకులను ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 187 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్, సీడాప్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'సంక్రాంతిలోపు సౌకర్యాలు కల్పించాలి'

తాడిపత్రిటౌన్: సంక్రాంతిలోపు 100 పడకల ఏరియా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలపై ఆరా తీశారు. రోగుల సౌకర్యార్థం త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డేనియల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి సామగ్రి వితరణ


కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి శఠగోపం, హారతి అందజేస్తున్న భక్తులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అనంతపురానికి చెందిన మోదుపల్లి రామేశ్వరమ్మ, కవిత కుటుంబ సభ్యులు రూ.72,400 విలువ చేసే వెండి శఠగోపం, హారతి (68.4 తులాలు) వితరణ చేసినట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేసి దాతలను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు

సంక్షోభంలో 'సంక్షేమ'ం

నియోజకవర్గం	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థులు
తాడిపత్రి	17	2,295
గుంతకల్లు	12	1,943
శింగనమల	14	2,570


● ఈ చిత్రంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం గుత్తిలోని కోటవీధిలో ఉంది. హాస్టల్‌లో దాదాపు 60 మంది విద్యార్థులున్నారు. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హాస్టల్ పైకప్పు పూర్తిగా దెబ్బతిని పెచ్చులు ఊడుతున్నాయి. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ పిల్లలు కాలం గడుపుతున్నారు. హాస్టల్‌కు ప్రహరీ ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు హాస్టల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇక బాత్‌రూంల పరిస్థితి దారుణంగా మారింది.


● ఈ చిత్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం పెద్దవడుగూరులో ఉంది. హాస్టల్‌లో దాదాపు 120 మంది విద్యార్థులున్నారు. బాత్‌రూం సౌకర్యం లేక విద్యార్థులు ఆరుబయటే స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో పిల్లలు ఆరుబయటకు వెళ్తుంటారు. కిటికీలకు మెస్ లేకపోవడంతో దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పైకప్పు శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఏడాది మరమ్మతులు చేశారు.


● ఈ చిత్రంలో చెట్ల కింద భోజనం చేస్తున్న విద్యార్థులు గార్లదిన్నెలోని ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు. హాస్టల్‌లో దాదాపు 480 మంది విద్యార్థులున్నారు. ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. వారికి అనుగుణంగా హాస్టల్ భవనాలు, తరగతి గదులు లేవు. బాత్‌రూంలు లేవు, తాగునీటి సౌకర్యం లేదు. డైనింగ్ హాలు లేక చెట్ల కింద భోజనం చేయాల్సిన దుస్థితి. స్నానపు గదులు లేవు. విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

- శిథిలావస్థలో హాస్టళ్లు
- వసతి గృహాల్లో విద్యార్థుల అవస్థలు
- పిల్లలకు అందని దుప్పట్లు, కార్పెట్లు

గుంతకల్లు/తాడిపత్రి/శింగనమల: పేద విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టం కనిపిస్తుంది. హాస్టళ్ల ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం..అధికార యంత్రాంగంపై ఉంది. క్షేత్రస్థాయిలో అటు అధికారుల అలసత్వం, ఇటు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హాస్టళ్లలో సమస్యలు పెరుగుపోతున్నాయి. గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ వసతి గృహాల్లో (3 నుంచి 10వ తరగతి వరకూ) విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడస్తున్నా ఇంత వరకు దుప్పట్లు, కార్పెట్స్ అందలేదు. అసలే చలికాలం ఆపై దోమల బెడద తీవ్రంగా ఉంది. దీంతో చాలామంది విద్యార్థులు ఇంటివద్ద నుంచి దుప్పట్లు తెచ్చుకున్నామని వాపోయారు. అలాగే మరుగుదొడ్ల సమస్య పిల్లలను వేధిస్తోంది

సమస్యలతో విద్యార్థులు సతమతం

● గుంతకల్లు పట్టణంలోని హనుమేష్‌నగర్‌లోని ఎస్సీ-1, ఎస్సీ-2 హాస్టళ్ల పేరిట రెండు వసతి గృహాలను సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం పేరిట నడుపుతున్నారు. దాదాపు 190 మంది విద్యార్థులు ఉంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు పూర్తి అయిన ఇంత వరకు దుప్పట్లు, కార్పెట్లను ప్రభుత్వం ఇవ్వలేదు.

● పాత గుంతకల్లులోని శ్మశాన వాటిక సమీపంలోని బాలుర కళాశాల వసతి గృహంలో సమస్యల తిష్ట వేశాయి. దాదాపు 175 మంది విద్యార్థులకు అనుగుణంగా బాత్‌రూం లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ఇక మరుగుదొడ్లకు తలుపులు దెబ్బతినడంతో అసభ్యకరంగా మారాయి. సమీపంలోనే శ్మశాన వాటిక ఉండడంతో రాత్రి పూట విద్యార్థులు భయాందోళనన చెందుతున్నారు.

● పామిడిలోని ఎద్దులపల్లిరోడ్డు బాలుర హాస్టల్‌లో సంక్షేమమే కరువైంది. ఈ హాస్టల్‌లో మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. ప్రహరీ కూలిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. హాస్టల్‌లో నీటి సమస్య వేధిస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక పిల్లలు మల మూత్ర విసర్జనకు ఆరుబయట ప్రాంతాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

● తాడిపత్రి నియోజకవర్గంలోని వసతి గృహాల్లో సమస్యలు తిష్టవేయడంతో వసతి పొందతున్న విద్యార్థులు దుర్భర పరిస్థితుల నడుమ వారి విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించింది. వసతి గృహాల్లోని స్లాబ్ పెచ్చులు ఊడి ఎప్పుడు పడతాయో అన్న భయంతో విద్యార్థులు గడుపుతున్నారు. మరో వైపు వసతి గృహాల్లో కిటికీలు, తలుపులకు మెస్ లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తుండడంతో తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు సక్రమంగా లేకపోవడంతో ఆరుబయట స్నానాలు ఆచరించే పరిస్థితి నెలకొంది. యాడికి మండలంలో 1 ఎస్సీ హాస్టల్ ఉండగా అందులో 90 విద్యార్థులు ఉంటున్నారు. అలాగే కేజీబీవీలో 240 మంది విద్యార్థినిలు, మోడల్ పాఠశాలలో 100 విద్యార్థినులు వసతి గృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. కానీ ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో వసతులు చాలా దారుణంగా ఉన్నాయి. అవి ఎక్కడ బయట పడుతాయోనన్న ఉద్దేశ్యంతో ఆయా పాఠశాలలను పరిశీలించేందుకు వెళ్లిన సాక్షి విలేకరిని ఎస్‌ఓలు, ప్రధానోపాధ్యాయులు లోనికి రాకుండా అడ్డుకున్నారు. దీన్ని బట్టి ఆయా వసతి గృహాల్లో ఎంతగా అవకవతవకలకు ఆయా సిబ్బంది పాల్పడుతున్నారో అర్థమవుతోంది.

● శింగనమలలోని ఎస్సీ బాలుర వసతిగృహం అధ్వాన స్థితికి చేరుకోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక పక్కనే ఉన్న కొండలోకి వెళ్తున్నారు. తాగడానికీ కొళాయిలు ఏర్పాటుకు గోడ నిర్మించారు. కానీ కొళాయిలు , పైపు లైను వేయలేదు. కిటికీలు, తలుపులు సరిగా లేవు. అలాగే తరిమెలలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో సమస్యలు నెలకొన్నాయి. అదేవిధంగా పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, నార్పల లోని హాస్టళ్లలో సమస్యలు వేధిస్తున్నాయి.

నీటి కోసం ఇక్కట్లు


హాస్టల్‌లోని బోరు చెడియింది. దీంతో హాస్టల్‌లో నీటి సమస్య ప్రళయతాండవం చేస్తోంది. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న పబ్లిక్ ట్యాప్ నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రహరీ లేకపోవడంతో విష పురుగుల బెడద నెలకొంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి

–దివాకర్, 5వ తరగతి, పామిడి

ప్రభుత్వం దృష్టి సారించాలి


హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం శ్రద్ధ కనబరచడం లేదు. హాస్టళ్లకు సరఫరా చేసే బియ్యం సరిగా లేకపోవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదు. అంతేకాకుండా మెస్ చార్జీలు కూడ పెండింగ్‌లో ఉన్నాయి. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలకు పెద్దపీట వేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి.

– వినోద్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు, గుంతకల్లు

మడుగును తలపిస్తోంది


హాస్టల్ ప్రవేశ ద్వారం వద్ద పిల్లర్ల గుంతల వద్ద వర్షపు మురుగునీరు మడుగును తలపిస్తోంది. ఇది ప్రమాదకర గుంతగా మారింది. అలాగే మురుగు దోమలకు నిలయమైంది. హాస్టల్ కిటికీలకు మెస్ సైతం పోయింది. దీంతో దోమలు ఎక్కువకావడంతో హాస్టల్ విద్యార్థులకు రోగాల భయం వెంటాడుతోంది.

–ఈశ్వర్, 6వ తరగతి, పామిడి

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి


ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గార్లదిన్నెలోని గ్రంథాలయంలో ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/గార్లదిన్నె/తాడిపత్రిటౌన్: బ్రిటీష్ పాలనను ఎదిరించి పోరాడిన ధీరవనిత ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జయంతి వేడుకలను ఏబీవీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్త్రీ శక్తి దివాస్ సందర్భంగా గుంతకల్లులో విద్యార్థినులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ మస్తాన్, ఏబీవీపీ భాగ్ కన్వీనర్ శివరాజ్, పట్టణ కార్యదర్శి వంశీ, ఉపాధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు రవితేజ, బన్నీ, మన్సూర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలోని గ్రంథాలయంలో జయంతి సందర్భంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి, ఇందిరాగాంధి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారిణి శిరీష, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తిలోత్తమ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

తాడిపత్రి పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా అభ్యున్నతిపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రవికుమార్, ఉపాధ్యాయులు ఆదినారాయణ, వెంకటరామయ్య, వీరారెడ్డి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వామపక్షపార్టీల నేతలు

పామిడి: పామిడిలో ఆధార్‌కార్డు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల సీనియర్ నాయకులు పీ అనిమిరెడ్డి, కే రహీమ్ మాట్లాడారు. ఆధార్‌కార్డు అప్‌డేట్, మార్పులు, చేర్పుల కోసం మండలేతర గ్రామాలైన కల్లూరు, పెద్దవడుగూరు గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనంతరం వారు పామిడి పంచాయతీలో ఉపాధి పథకం అమలు చేయాలని ఎంపీడీఓ తేజోత్స్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల మండల నాయకులు మల్లేసు, ముత్యాలు, చౌడప్ప, నాగరాజు, వీరప్ప, రాముడు, బాబాఫక్రుద్దీన్, జాఫర్, చంద్రమోహన్‌రెడ్డి, శంకర్, వలి, ప్రసాద్‌తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థి తల్లి సరోజమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: ఐఐటీ చదువుతున్న ఓ విద్యార్థికి రోటరీ క్లబ్ ఆర్థిక సాయం అందించింది. యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ సరోజమ్మ కుమారుడు ఎస్.ప్రవీణ్ నాగపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి)లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మృతి చెందడంతో ప్రవీణ్‌కు చదువు భారంగా మారింది. విషయం తెలుసుకున్న రోటరీ క్లబ్ సభ్యులు ప్రవీణ్‌కు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చారు. మంగళవారం రాత్రి స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో రూ.25వేల నగదు సాయాన్ని ప్రవీణ్ తల్లికి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సంజన్న, కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి బాలసుబ్రమణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని నగరూరు ఉన్నత పాఠశాల, వేములపాడు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 183 మంది విద్యార్థులకు మంగళవారం కంటి వైద్య నిపుణుడు మధుసూదన్ రాజు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 11మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసర మైనట్లు గుర్తించారు. అవసరమైన విద్యార్థులకు మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో నగరూరు ఉన్నత, వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు కుళ్లాయప్ప, గాయత్రి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శారద, గోవర్దన గిరి, గోపాలరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం


రుద్రాభిషేకం చేస్తున్న చన్నవీర శివాచార్య స్వామీజీ

గుంతకల్లుటౌన్: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పాల్తూరులోని కల్లుహోలే మఠాధిపతి చెన్నవీర శివాచార్య మహాస్వామి సూచించారు. మంగళవారం నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులోని శ్రీవివేకానంద పార్క్‌లో రుద్రాభిషేకం, కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ హిందూ సంస్కృతి చాలా గొప్పదన్నారు. క్షమించే గుణానికి ప్రతీకగా భావించే ఉసిరిచెట్టును లక్ష్మీదేవి స్వరూపంగా పరిగణిస్తారన్నారు. అందుకే కార్తీక మాసంలో ఉసిరి చెట్టు ఉండే వనంలో భోజనాలు చేస్తారన్నారు. నగర ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కాకర్ల ప్రకాష్, అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి, కార్యదర్శి సోమనాథ్, కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపాజగదీష్, పురప్రజలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామ సమీపంలో ఎస్ఐ శ్రీరాం ప్రసాద్ తన సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ఆయన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు.

భూముల పరిశీలన


సంజీవపురంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల, సంజీవపురం గ్రామాల్లోని భూములను మంగళవారం అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఈరమ్మ మాట్లాడుతూ యర్రగుంట్లలో 263-4 సర్వే నంబర్‌లో 44 సెంట్లు భూమి ఇద్దరు రైతుల మధ్య వివాదాస్పదంగా ఉండడంతో ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రికార్డు ప్రకారం భూమి ఉన్న రైతుకు 44 సెంట్లు చెందుతుందని రైతులకు సూచించారు. అలాగే సంజీవపురంలో పట్టా భూమిలో రస్తా కావాలని అర్జీ రావడంతో ఆర్డీఓ దారి పరిశీలించారు. పట్టా భూమిలో రస్తా ఇవ్వమని రైతులు ఆర్డీఓకు విన్నవించుకు న్నారు. అలాగే పొలం వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్యామల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గిడ్డయ్య, ఓబులేసు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన గిడ్డయ్య, ఓబులేసు మంగళవారం ద్విచక్రవాహనంలో గుత్తి పట్టణానికి బయలుదేరారు. జాతీయ రహదారిపైకి రాగానే గుంతకల్లు వైపు నుంచి గుత్తి వైపునకు వెళ్తున్న లారీ వెనుక నుంచి వేగంగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి

యాడికి: ఈ నెల 14న మండలంలోని రాయలచెరువు గ్రామంలోని నగరూరు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కర్నూలులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ధర్మవరానికి చెందిన చంద్రాయుడు(37)కు భార్య రత్నమ్మ, కూతురు ఉన్నారు. మూడు నెలల క్రితం ఆయన యాడికి మండలం రాయలచెరువుకు వచ్చి ఓ టీస్టాల్ దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 14న నడచుకుంటూ వెళ్తున్న చంద్రాయుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అతడిని కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేర సమాచారం

నాటుసారా స్వాధీనం

తాడిపత్రి అర్బన్: అక్రమంగా తరలిస్తున్న నాటు సారాను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ జి.నాయుడు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం బైపాస్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా వీరన్న అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు., కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.

మోటారు వైర్ల చోరీ


చోరీ చేసిన వైర్లను చూపుతున్న రైతు

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి శివారులోని పొలాల్లో మంగళవారం బోరు మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వివరాలు... గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ తన పొలంలో వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేశాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పొలంలో మోటార్‌కు ఏర్పాటుచేసిన30 మీటర్ల విద్యుత్ వైర్‌ను దొంగలించారు. అదే విధంగా పక్క పొలాల్లో మరో ఇద్దరు రైతులకు సంబంధించి 40 మీటర్ల విద్యుత్ వైర్లను చోరీ చేసినట్లు రైతులు గుర్తించారు. సుమారు రూ.18 వేలు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు బైక్‌ల ఢీ

గుత్తి: పట్టణ శివారులోని ఎస్కేడీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.వివరాలు.. గార్లదిన్నెకు చెందిన మధు, నాగరాజు బైక్‌లో గుంతకల్లుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను మరో బైక్ ఢీ కొనింది. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టెంకాయ పందెం రాయుళ్ల బైండోవర్

యల్లనూరు: మండలంలోని కల్లూరు గ్రామం వద్ద రెండు రోజుల కిందట టెంకాయి పందేలు ఆడుతూ 14 మంది ఎస్ఐ శ్రీరాం ప్రసాద్‌కు పట్టుబడ్డారు. నిందితులను మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారు రాజా సమక్షంలో పుట్లూరు సీఐ సత్యబాబు బైండోవర్ చేశారు. 14 బైకులకు ఒక్కో బైకుకు రూ.2వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.


చీటింగ్ కేసు నమోదు

తాడిపత్రిటౌన్: బలిజసంఘం నిదులు దుర్వినియోగం చేసాడన్న కారణంగా ఆ సంఘం మాజీ గౌరవ అధ్యక్షుడు కలూరు శ్రీనివాసులుపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బలిజ సంఘం సభ్యుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సాయి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని అనంతపురం రోడ్‌లో మంగళవారం రాత్రి మట్కా బీటర్ లక్ష్మయ్యను అరెస్టు చేసి, అతడి నుంచి రూ. 30,100 స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ ధరణీ బాబు, సిబ్బంది కలిసి పట్టణంలోని నందలపాడుకు చెందిన లక్ష్మయ్యను అరెస్టు చేశారన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న పర్వీన్

బుక్కరాయసముద్రం: లింగ వివక్ష నిర్మూలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కొర్రపాడు పీహెచ్‌సీ హెల్త్ ఎడుకేటర్ పర్వీన్ అన్నారు. మంగళవారం మండల కొర్రపాడు ఎస్సీ గురుకుల పాఠశాలలో లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి ఉన్నత రంగాలలో రాణించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సీహెచ్ఓ మోహన్‌బాబు, సూపర్‌వైజర్ కేశవయ్య, రాజేంద్ర, విజయలక్ష్మి రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.